

సమావేశంలో మాట్లాడుతున్న ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఎం.రామారావు, చిత్రంలో ఐహెచ్ఎస్ఎం వైస్ డీన్ డాక్టర్ భానుప్రకాష్

కిర్గిస్తాన్‌లో విదేశీ విద్యార్థులపై దాడులు నిజం కాదు

పంజాగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కిర్గిస్తాన్‌లో విదేశీ వైద్య విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయనేది నిజం కాదని, ఓ పబ్ లో వేరే దేశానికి చెందిన వారు గొడవపడ్డారని, దీనిని విదేశీ విద్యార్థులపై దాడి అంటూ కొంత మంది సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేశారని ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఎం. రామారావు, కిర్గిస్తాన్‌లోని ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్(ఐహెచ్ఎస్ఎం)వైస్ డీన్ డాక్టర్ భాను ప్రకాష్ అన్నారు.గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐహెచ్ఎస్ఎం ఫ్యాకల్టీలు డాక్టర్ అజీజా అజి బెకోవ, సిటోర జైరోవ, ఐఎస్ఎం డైరెక్టర్ కె.నాగేశ్వరరావుతో కలిసి వారు వివరాలు వెల్లడించారు. కిర్గిస్తాన్ దేశంలో ఇటీవల జరిగిన అల్లర్ల విషయంలో ఇండియాలో అపోహలు వ్యాపించాయని, విదేశీ విద్యార్థులపై దాడి అనగానే మన వారు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారని అన్నారు. ఈజిప్ట, పాకిస్థాన్, తదితర దేశాలకు చెందిన విద్యార్థుల మధ్య ఓ పబ్ లో ఘర్షణ చోటుచేసుకుందని, కొంతమంది వీడియోలు మార్ఫింగ్ చేసి విద్యార్థులు చనిపోయినట్టు ప్రచారం చేశారని, అవి నిజమని నమ్మి సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారని అన్నారు. ఆ వార్తలు నిజం కాదని, కిర్గిస్తాన్‌లో ఎంతో భద్రత ఉంటుందని, ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు నాలుగు వేల మంది, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మరో ఇరవై వేల మంది అక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కిర్గిస్తాన్ లోని భారత రాయబార కార్యాలయం వెంటనే స్పందించిందని, అక్కడి వసతి గృహాలను అక్కడి రాయబారి, ఇండియా నుంచి వెళ్లిన జాతీయ మీడియా బృందం కూడా సందర్శించిందని అన్నారు. తల్లిదండ్రుల్లో ఆందోళన తగ్గకపోవడంతో బిష్ కేక్‌లో ఉన్న విద్యార్థులను వారి స్వస్థలాలకు పంపించినట్టు తెలిపారు. ఈ నెల 13 వరకు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదని, ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు అక్కడే క్షేమంగా ఉన్నారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి భయాందోళనకులోను కావద్దని, ఫేక్ వీడియోలు, వార్తలు నమ్మొద్దన్నారు.

అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసనకు యత్నం

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాయదుర్గం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా నిఘా సంస్థలు డైరెక్టెడ్ వెపెన్స్‌తో తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడంపై టార్గెటెడ్ ఇండ్యావిజువల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రావి తరుణ్ ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మరో నలుగురు సభ్యులతో కలిసి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందింది. వారు రావి తరుణ్‌తో సహా మరో ముగ్గురిని గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులు, భారతి సంతతికి చెందిన చాలామంది నిఘా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. న్యూరో వెపన్స్ ద్వారా అమెరికా నిఘా సంస్థలు అమెరికాలో ఉంటున్న వివిధ విదేశీ సమూహాలపైన నిఘాపెట్టి వేధిస్తున్నాయని ఆరోపించారు. ప్రారంభంలో అమెరికా పరిశోధన కేంద్రాల్లో నిమగ్నమై ఉన్న టెక్నాలజీ క్రమంగా అమెరికా ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేటర్ శక్తులకు అవసరంగా మారిందన్నారు. ఈ సమస్యపై అందరికి అవగాహన కల్పించి జాగృతం చేయడమే తమ లక్ష్యమని తరుణ్ పేర్కొన్నారు. న్యూరో వెపన్స్ గురించి హవాన సిండ్రోమ్, సింథటిక్ టెలిపతి గురించి ఎవరికి వారు పరిశోధన జరిపి నిగ్గుతేల్చుకుని వినాశనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పోలీసు అరెస్టులు తమ కార్యక్రమాన్ని ఆపవని, భవిష్యత్‌లో పలు సెమినార్లు వర్క్‌షాపులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని అన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై వారిని వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.



పేపర్ ప్లేట్ మిషిన్‌ను పరిశీలిస్తున్న గారేత్ వాన్ ఒవెన్

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్


అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పేపర్ ప్లేట్ మిషిన్ అందజేస్తున్నట్లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్ తెలిపారు. గురువారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రేమలీల ట్రాన్స్‌జెండర్ కార్యాలయంలో పేపర్ ప్లేట్ మిషిన్‌ను ఆయన అందజేశారు. ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి తోడ్పాటునందిస్తున్న హాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోనిని అభినందించారు. ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి మాట్లాడుతూ హాస్ సంస్థ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. ఆంథోని మాట్లాడుతూ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు ట్రాన్స్‌జెండర్లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

2,800 బస్సులు గమ్యం యాప్‌తో అనుసంధానం

- 'గమ్యం యాప్ సేవలు అంతంతే'కు స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు అంతంతే' అని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. గ్రేటర్ జోన్ పరిధిలో 2,800 బస్సులను గమ్యం యాప్‌నకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. యాప్‌లో బస్సుల వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ డిపోలో ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించామని తెలిపారు. డిపో పరిధిలో ఆయా బస్సుల ట్రాకింగ్‌ను ఆ ఉద్యోగి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు.



రైటప్ - రెజ్ వాటర్ వేపర్ థెరపీ తర్వాత రోగితో యశోద ఆస్పత్రి వైద్యులు

ప్రొస్టేట్ ఇబ్బందులకు 'రెజుమ్ వాటర్ వేపర్ థెరపీ'

- తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి
- ప్రొస్టేటిక్ అబ్‌స్ట్రక్షన్ సమస్యలకు చెక్

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మూత్ర విసర్జన నొప్పి సమస్యను ఎదుర్కొంటున్న ఓ వృద్ధుడికి యశోద ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స లేకుండా ఆధునిక విధానంలో వైద్య ప్రక్రియను నిర్వహించి సమస్యకు చెక్ పెట్టారు. సోమాజీగూడలోని యశోద ఆస్పత్రిలో యూరాలజీ విభాగంలో రెజుమ్ వాటర్ వేపర్ థెరపీ'ని ఇటీవల విజయవంతంగా నిర్వహించారు. ఈ తరహా ప్రక్రియ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటి సారి ఆస్పత్రి వైద్యులు వివరించారు. కామారెడ్డికి చెంది ఎస్.అంజాగౌడ్(68) అనే రైతు కొన్ని వారాలుగా మూత్ర విసర్జన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన సీనియర్ యూరాలజిస్టు రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డాక్టర్ వి.సూర్యప్రకాష్‌ను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించి, బ్లాకేజ్ సమస్యగా నిర్ధారించారు. దీనిని రెజుమ్ వాటర్ వేపర్ థెరపీ' ద్వారా తొలగించామన్నారు. ఈ చికిత్స తర్వాత అదే రోజు ఇంటికి వెళ్లవచ్చని డాక్టర్. వి.సూర్యప్రకాష్ చెప్పారు.

ఎర్రమంజిల్ పాఠశాలను కాపాడుకుంటాం



ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్లాన్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ప్రొఫెసర్లు శాంతా సిన్హా, కోదండరాం, రహదారులు, భవనాల శాఖ ఈ.ఎన్.సి గణపతి రెడ్డి, విజయా రెడ్డి



పాఠశాలలో పూర్వ విద్యార్థులు

పంజాగుట్ట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎర్రమంజిల్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో గతంలో వేల మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం నాలుగు వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్స్ ఆస్పత్రి విస్తరణకు ఎర్రమంజిల్ ప్రభుత్వ క్వార్టర్స్‌తో పాటు పాఠశాల స్థలాన్ని కూడా కేటాయించింది. వెంకటరమణ కాలనీకి వెళ్లే మార్గంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్, స్పెషల్ బ్రాంచ్ కార్యాలయం సమీపంలో ఒక ఎకరం స్థలాన్ని పాఠశాల నూతన భవన నిర్మాణానికి కేటాయించింది. కానీ అందులో పనులు ప్రారంభం కాలేదు. కొత్త భవనం నిర్మించిన తర్వాతనే ప్రస్తుతం ఉన్న పాఠశాలను తరలించాలని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ పి.విజయా రెడ్డితో పాటు ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ కొదండరాం గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి కూడా అక్కడికి వచ్చారు. అందరూ కలిసి పాఠశాలను పరిశీలించారు.

2007 సంవత్సరం నుంచి సమస్య ఉందని, అప్పుడే పాఠశాల స్థలాన్ని నిమ్స్ విస్తరణకు కేటాయించారని, వేరే ప్రాంతంలో భవనం నిర్మించి ఇస్తామని అప్పటి సీఎం శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. గతంలో పాఠశాలకు రావాలంటే ఐదు మార్గాలు ఉండగా ప్రస్తుతం జీవీకే మాల్, నిమ్స్ ఆస్పత్రి నుంచి మాత్రమే మార్గం ఉందని, పంజాగుట్ట, సోమాజిగూడ, ఎర్రమంజిల్, ఆర్కే నగర్, ప్రేమ్ నగర్, వెంకటరమణ కాలనీ, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు రావాలంటే చుట్టూ తిరిగిరావాల్సి ఉంటుందన్నారు. అందుకే విద్యార్థులు పాఠశాలకు రాలేక పోతున్నారని, కొంతమంది బడి మానేశారని తెలిపారు.

- పాఠశాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పన, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ఇప్పటి వరకు సుమారు అరవై లక్షలకు పైగా ఖర్చు పెట్టామని, కొత్త భవనం నిర్మించిన తర్వాతేనే పాఠశాలను తరలించాలని వారు డిమాండ్ చేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పూర్వ విద్యార్థులు సోమాద్రి రామ్మూరి, వి.సుధాకర్, ఎస్.ఆర్. కళ్యాణ్ దాస్, శ్రీనివాస్ గౌడ్, లలితశ్రీ, అమ్జద్, స్థానిక నాయకులు వారి వెంట ఉన్నారు.
- విద్యార్థుల కోసం ఎర్రమంజిల్ మహిళా మండలి భవనం నుంచి పాఠశాల వరకు 100 అడుగుల రహదారి ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

దసరా నాటికి అందుబాటులోకి..

ఎర్రమంజిల్ మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఎకరం స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి కేటాయించడం జరిగింది. ఇప్పటికే భవనం ప్లాన్ తయారుగా ఉంది. సమయం తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారం, పది రోజుల్లో ఆయనతోనే శంకుస్థాపన చేపిస్తాం. దసరాలోపు కొత్త భవనం నిర్మించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత ఉండాలని సీఎం లక్ష్యం.

- దానం నాగేందర్, ఎమ్మెల్యే, ఖైరతాబాద్

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



ప్రదర్శనలో ఉత్పత్తులనుపరిశీలిస్తున్న వినియోగదారులు

బంజారాహిల్స్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా పడుతున్నాయి. మరోవైపు రాబోయేది పండుగల సీజన్ ఈ తరుణంగా సమ్‌థింగ్ స్పెషల్‌గా కనిపించాలని ఫ్యాషన్ ప్రియులు కోరుకుంటున్నారు. వీరికి వన్‌స్టాప్ సొల్యూషన్‌గా అన్ని వస్తువులను ఒకే వేదిక మీదకు తెస్తూ శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు అయిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 16వ తేదీన ప్రదర్శన ముగుస్తుందని తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి



ఖాజానగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నట్టు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు-12 ఖాజానగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బంజారాహిల్స్ డివిజన్‌లో ఉన్న పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్యలపై ఫిర్యాదులు అందాయని, ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో పనులకు నిధులు మంజూరు అయినప్పటికీ వాటిని అమలు చేయలేకపోయినట్టు చెప్పారు. దశల వారీగా పనులు మొదలు పెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

- వినతి



తమ బస్తీలో సమస్యలు పరిష్కరించాలని గురువారం రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 హనుమాన్ స్టోన్ కట్టర్స్ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య, ఉపాధ్యక్షుడు బి.చెన్నయ్య కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని కలిసి కోరారు. సీఎన్ రెడ్డి స్పందిస్తూ అధికారులతో చర్చించి త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- యూసుఫ్‌గూడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి)

జూలై 9న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం



ఎల్లమ్మ తల్లి మూల విరాట్

అమీర్‌పేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం జూలై 9న వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. జూలై 8న ఒగ్గు కళాకారులతో పుట్టమన్ను తెప్పించడంతో పాటు ఎస్ఆర్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఎదుర్కోళ్లు, (శాక్తేయముగా) నిర్వహిస్తూ ఎల్లమ్మ దేవాస్థానం వరకు ఊరేగింపుగా రావడంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9న ఆలయానికి తూర్పు ముఖంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తారు. 10వ తేది 6 గంటలకు కల్యాణం వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులతో రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి. గత సంవత్సరం నిర్వహించిన కల్యాణానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాం కలుగకుండా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నెల రోజుల ముందుగానే వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించేవారు. ఈ సారి మాత్రం కల్యాణ సమయం దగ్గర పడుతున్నా ఏర్పాట్లు, ఆలయ సుందరీకరణపై ఆలయ చైర్మన్, అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈవో నాగరాజు లాంగ్ లీవ్‌లో ఉండడం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు తీసుకున్న జ్యువెల్లరీ ఇన్‌స్పెక్షన్ అధికారి(జేవీవో) అంజలి దేవి ఏర్పాట్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు. గత సంవత్సరం అమ్మవారి కల్యాణం వీక్షించేందుకు అంచనాలకు మించి భక్తులు 10 లక్షల మంది విచ్చేశారు. ఈ సారి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయనున్న నేపథ్యంలో సౌకర్యాలపై అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

బీదర్, పద్మావతి రైలులో దొంగలు పడ్డారు

- ఎస్-4,9,10 బోగిలలో చోరీ
- పలువురి మెడల్లోని బంగారు గొలుసుల అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ జూన్ 13(ఆంధ్రజ్యోతి): బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో దొంగలు పడ్డారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న పద్మావతి, బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్- 4,9,10 బోగిలోని ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఈ ఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సిగ్నల్ కట్ చేయడంతో రైలు ఆగిపోయింది. ఆ సమయంలో కింద రైలు పట్టాలపై ఉన్న నలుగురు దొంగలు ఎస్-4,9,10 బోగిలలో కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణికుల మెడలలోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఎస్4 బోగిలో ప్రయాణం చేస్తున్న పద్మావతి అనే మహిళ మెడలో బంగారు గొలుసు, వర్ధనమ్మ మెడలో నుంచి 20గ్రాముల బంగారు గొలుసు, వి.కుమార్ అనే ప్రయాణికుడి మెడలో 16 గ్రాములు బంగారు గొలుసు, జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్న కీర్తన బ్యాగులో ఉన్న రూ. 13 వేల నగదు కిటికీల నుంచి ఎత్తుకెళ్లిపోయారు. బాధిత ప్రయాణికులందరూ గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదుల చేశారు. కేసు నమోదు చేసుకున్న జీఆర్‌పి పోలీసులు ఖమ్మం జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేశారు. సిగ్నల్ కట్ చేసి రైళ్లలో దోపిడికి పాల్పడినట్లు విచారణలో తెలిసింది.

విద్యుత్ ఉద్యోగులకు ట్రాఫిక్ పాఠాలు



ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

ఖైరతాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలకు వచ్చి వెళ్లే సమయాల్లో వాహనాలను నెమ్మదిగా నడపాలని ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట ఏసీపీ జి.శంకర్‌రాజు సూచించారు. గురువారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో టీఎస్ఎస్‌పీడీసీఎల్ సంస్థ అధికారులు, ఉద్యోగులకు రోడ్డు ప్రమాదాలు-నివారణ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఇందులో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ నియమాలను, రోడ్డు ప్రమాదాలు జరిగే విధానాలు, తీసుకోవాల్సి న జాగ్రత్తలను వివరించారు. సిగ్నల్ పడ్డ సమయంలో తప్పకుండా ఆగాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ఈ మధ్య బైక్‌లే కాక ఆటోలు, కార్లు సైతం రాంగ్‌రూట్లో వస్తున్నాయని, ఇది మంచిది కాదని గుర్తు చేశారు. దాదాపు 400మంది ఉద్యోగులు పాల్గొన్న ఈ శిక్షణలో టీజీఎస్‌పీడీసీఎల్ జాయింట్ సెక్రెటరీ సీహెచ్ ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ జనరల్ మేనేజర్ బీఆర్ నాయక్, అదనపు ఎస్పీ పి.నారాయణ, ట్రాఫిక్ అధికారులు ఎం.కృష్ణ, మహమ్మద్ అయాన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయ ముఠా అరెస్ట్

- 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యా న్ని కొనుగోలు చేసి, బ్లాక్ మా ర్కెట్‌కు తరలిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సివిల్ సప్లై అధికారులతో కలిసి హుమాయున్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట, యాకుత్‌పురా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 9మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం వ్యాపారులుగా చెలామణి అవుతున్న అత్తాపూర్‌కు చెందిన విశాల్‌యాదవ్ (22), ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నాసిర్ (28), వారాసిగూడకు చెందిన మహ్మద్ షోయబ్ (20), మహ్మద్ జహంగీర్, (28), ఎండీ షాబాజ్ (28)సరూర్‌నగర్‌కు చెందిన సంగం లోవ అలియాస్ రాజు(24), పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీం(25), అంబర్‌పేటకు చెందిన సయ్యద్ రహీం (25), సయ్యద్ నిజాం (24), మహ్మద్ మజార్ (28) రేషన్ బియ్యం దందా చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరించి, నిల్వ ఉంచుతున్నారు. వాటిని అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అరెస్ట్ చేశారు.

పంజాగుట్ట శ్మశానవాటికలో త్వరలో పనులు

- పవర్‌బోర్లకు ప్రతిపాదనలు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖైరతాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 40 ఎకరాలున్నా సదుపాయాలే కల్పించరు! అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో పంజాగుట్ట స్మశాన వాటికలో సమస్యలపై వచ్చిన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు స్పందించారు. ఈవిషయమై స్థానిక కార్పొరేటర్ సర్కిల్ 18 ఈఈ విజయ్ కుమార్, ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. పనులకోసం విడుదలైన నిధులు అయిపోవడంతో అదనపు నిధులతో ప నులను కొనసాగించేందుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించామని, ఈమేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశామని జూబ్లీహిల్స్ సర్కిల్ ఉపకమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రక్రియ వేగవంతం చేసి మరో నెల రోజుల్లోపు పనులను పూర్తిచేయిస్తామని వారు పేర్కొన్నారు. శ్మశానవాటికలో బోర్లు ఎండిపోయినందున వీలైనంత త్వరలో పవర్ బోర్లు వేయిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తెలిపారు.

ఇంటి వద్ద పార్క్ చేసిన వాహనాలు మాయం

యూసుఫ్‌గూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇంటి ఎదు ట పార్కింగ్ చేసిన ఆటో, ద్విచక్రవాహనం మాయమయ్యాయి. ఈ సంఘటనలు మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యాదగిరి నగర్‌లో నివాసం ఉండే డి.శివకుమార్ ఆటో డ్రైవర్. ఈనెల 11వ తేదీ తన ఆటోను ఇంటి ఎదుట పార్కింగ్ చేసి 12వ తేదీ ఉదయం ఆటో తీసేందుకు చూడగా కనిపించలేదు. వెంటనే మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రహ్మత్‌నగర్‌కు చెందిన ఆర్.రమేష్ కాంట్రాక్టర్. ఈనెల 11వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనం తన ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 104 ఆవులు స్వాధీనం

కోదాడ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 104 ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీద్‌ఖాన్, యూసఫ్, సలీం ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 104 ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని సమాచారం అందింది. గురువారం కోదాడ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ ప్రారంభించారు. కంటైనర్‌ను గుర్తించి, ఆవులను, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆవులను ఏపీ రాష్ట్రంలోని వేదాద్రి దేవాలయ గోశాలకు తరలించి, సంబంధితులతో పాటు వాహన డ్రైవర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

బర్కత్‌పర, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బడుగుల కిష్టమ్మ(63) శివరాంపల్లిలో ఉంటూ కూలి పనిచేస్తూ జీవిస్తుంది. భర్త చంద్రయ్య కొంతకాలం క్రితం చనిపోయాడు. గురువారం కిష్టమ్మ వట్టిపల్లి వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

చెల్లిపై దాడి చేసిన సోదరులపై కేసు

కవాడిగూడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటి అద్దె డబ్బులు తల్లికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన చెల్లిపై ఇద్దరు సోదరులు దాడి చేసిన సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... కవాడిగూడ డివిజన్ ఎస్బీఐ కాలనీలో హైమద్ బేగం నివాసం ఉంటోంది. ఆమె ఉంటున్న ఇంట్లో కొంత భాగాన్ని అద్దెకు ఇచ్చారు. నాలుగేళ్లుగా అహ్మద్ బేగం కుమారులు సయ్యద్ ఆజం అలీ, సయ్యద్ ముజఫర్ అలీ ఇంటి అద్దె తీసుకుంటున్నారు. అద్దె డబ్బులు తల్లికి ఇవ్వడం లేదన్న విషయం తెలుసుకున్న అహ్మద్ బేగం కూతురు సయ్యద్ పర్వీన్ ఇదే విషయంపై తన సోదరులను నిలదీసింది. ఆజం అలీ, ముజఫర్ అలీ చెల్లి పర్వీన్‌పై దాడిచేశారు. తన ఇద్దరు సోదరులు కూరగాయలు కోసే కత్తితో తనపై దాడి చేశారని, దాంతో చేతికి తీవ్రగాయాలయ్యాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గాంధీనగర్ సీఐ తెలిపారు.

గ్రామీణ విద్యార్థుల కోసం ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్



ప్రత్యేక బస్సులో ఏర్పాటు చేసిన లాబోరేటరీ

పంజాగుట్ట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ పూర్తి చేసి విద్యార్థులు ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్(ఫ్లో)ను ఏర్పాటు చేశారు. ఈ నెల 10న రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో ఎడోధ్వజా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈఓ మధులాష్ బాబు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ పవన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కె. ప్రసన్న మౌనిక, సీఐఓ కె.మధుబాబు, నాంది వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు వికాస్ కాట్రగడ్డతో కలిసి వివరాలు వెల్లడించారు. ఇంజనీరింగ్ చదివిన 18 మంది ఒక బృందంగా ఏర్పడ్డామని, విద్యార్థులకు కృత్రిమమేధ, రోబోటిక్స్, త్రీడి ప్రింటింగ్, త్రీడి హోలోగ్రామ్, తదితర వాటిపై అవగాహన కల్పించడానికి, వాటిని నేర్పడానికి ఒక స్టార్ట్ అప్‌ను అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అమెరికాలోని జార్జ్ మాసన్ యూనివర్సిటీ లక్ష డాలర్లు, తిరుపతిలోని శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం 25 లక్షల రూపాయలను ఫండింగ్ చేశాయని తెలిపారు. వాటి సహాయంతో ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్‌ను రూపొందించామన్నారు. దీని కోసం సుమారు కోటి ఐదు లక్షల రూపాయలు అయ్యిందన్నారు. బస్సు డీజిల్‌తో నడిచినా సోలార్ ఎనర్జీతో లోపల పరికరాలు, ఏసీ పనిచేస్తుందని, అలెక్సా వాడమని కృత్రిమ మేధతో బస్సు లోపల అన్ని పనిచేసేలా తీర్చిదిద్దామని అన్నారు. ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్‌తో నెల రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులకు కృత్రిమమేధ, రోబోటిక్స్, త్రీడి ప్రింటింగ్, త్రీడి హోలోగ్రామ్, తదితర వాటిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకో ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కోట నీలిమ

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి : కోటనీలిమ

రాంగోపాల్‌పేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాలకు భక్తులకు ఇబ్బందులు తెలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అధికారులకు సూచించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పరిసరాలని పరిశీలించిన నీలిమ, బోనాల జాతరకు సంబంధించిన ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జూలై 21, 22 తేదీల్లో జరుగనున్న బోనాలకు వచ్చే మహిళా భక్తులకు, వయోవృద్ధులకు ప్రత్యేకంగా క్యూ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవాదాయ సహాయ కమిషనర్, ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి కామేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అదనపు కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సీతాఫల్‌మండి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి

- కార్పొరేటర్ సామలహేమ

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్లో అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ సామలహేమ, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆమ్రపాలిని కలిసి కార్పొరేటర్ వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల కంటే ముందు సీసీ రోడ్లు టెండర్లు రద్దు అయినందున మళ్లీ రీటెండరింగ్ చేసి అభివృద్ధి పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని గార్బేజ్ బ్యాగులు సరిపడేవిధంగా పంపాలని కోరారు.

ప్రభుత్వం మారినా ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు తీరలేదు

- కార్పొరేటర్ కొంతం దీపిక

రెజిమెంటల్‌బజార్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారింది తప్ప, ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు తీరలేదని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పథకాల పేర్లు మారుతున్నాయి తప్ప విద్యార్థులకు ఒరిగింది ఏమీలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు మంజూరీ అయిన మన ఊరు - మన బడి పనులు పూర్తి కాలేదు. మళ్లీ ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద కొన్ని పాఠశాలలో చేపట్టిన పనులు కూడా పూర్తి కాలేదు అని ఆరోపించారు. అనంతరం విద్యార్థులకు బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

2,800 బస్సులు గమ్యం యాప్‌తో అనుసంధానం

- 'గమ్యం యాప్ సేవలు అంతంతే'కు స్పందన

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు అంతంతే' అని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. గ్రేటర్ జోన్ పరిధిలో 2,800 బస్సులను గమ్యం యాప్‌నకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. యాప్‌లో బస్సుల వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ డిపోలో ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించామని తెలిపారు. డిపో పరిధిలో ఆయా బస్సుల ట్రాకింగ్‌ను ఆ ఉద్యోగి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు.

బీదర్, పద్మావతి రైలులో దొంగలు పడ్డారు

- ఎస్-4,9,10 బోగిలలో చోరీ
- పలువురి మెడల్లోని బంగారు గొలుసుల అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ జూన్ 13(ఆంధ్రజ్యోతి): బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో దొంగలు పడ్డారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న పద్మావతి, బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్- 4,9,10 బోగిలోని ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఈ ఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సిగ్నల్ కట్ చేయడంతో రైలు ఆగిపోయింది. ఆ సమయంలో కింద రైలు పట్టాలపై ఉన్న నలుగురు దొంగలు ఎస్- 4,9,10 బోగిలలో కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణికులు మెడలలోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఎస్4 బోగిలో ప్రయాణం చేస్తున్న పద్మావతి అనే మహిళ మెడలో 4 గ్రాములు బంగారు గొలుసు, వర్ధనమ్మ మెడలో నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, వి.కుమార్ అనే ప్రయాణికుడి మెడలో 16 గ్రాములు బంగారు గొలుసు, జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్న కీర్తన బ్యాగులో ఉన్న రూ.13 వేల నగదు కిటికీల నుంచి ఎత్తుకెళ్లిపోయారు. బాధిత ప్రయాణికులందరూ గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదుల చేశారు. కేసు నమోదు చేసుకున్న జీఆర్‌పి పోలీసులు ఖమ్మం జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేశారు. సిగ్నల్ కట్ చేసి రైళ్లలో దోపిడికి పాల్పడినట్లు విచారణలో తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలకు కొత్తహంగులు

- రంగులతో ఆకర్షణీయంగా మారిన భవనాలు
- మరుగుదొడ్లు, కుళాయిల ఏర్పాటు
- పిల్లల్ని బడికి తీసుకు వచ్చేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు




కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు



కొత్తగా ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో స్కూలుకు రంగులువేసిన దృశ్యం

అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కొత్త రంగులతో దర్శనమిస్తున్నాయి. కార్పొరేట్ స్థాయిలో చదువులు చెప్పేందుకు టీచర్లు సిద్ధమయ్యారు. రెండో రోజు బడి ప్రారంభం కావడంతో విద్యార్థులు కొత్త హంగులతో ఉన్న పాఠశాలలో అడుగుపెట్టేందుకు ఇష్టపడుతున్నారు. గతంలో ప్రతి బడిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఈ ఏడాది ప్రతి స్కూలులో విద్యార్థినీ విద్యార్థులకు అనుకూలంగా సౌకర్యాలు కల్పించారు. ఈ ఏడాది డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేసి కొత్తగా మరగుదొడ్లు నిర్మించారు. తాగేందుకు నీళ్ల కుళాయిలు, ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని ఏర్పాటుచేశారు. ప్రతి విద్యార్థి బడికి రావడమే లక్ష్యంగా గత ఇరవై రోజుల క్రితం ప్రత్యేక సర్వే చేపట్టారు. డ్రాప్‌ఔట్ పిల్లల ఇంటికి వెళ్లిన టీచర్లు పిల్లల్ని మళ్లీ బడికి పంపించడంలో అడ్డగుట్ట ప్రభుత్వ టీచర్లు ప్రముఖ పాత్ర పోషించారు. దీంతో విద్యార్థుల శాతం పెరిగింది..

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మారేడుపల్లి మండల పరిధిలో 12 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 10 పాఠశాలలో కొత్తరకంగా పాఠశాలకు రంగులు వేయడం, పాఠశాలలో విద్యార్థులకు అనుకూలంగా ఉండేందుకు మంచినీటి ట్యాంకులు, పాఠశాల ఆవరణలో విద్యార్థులు భోజనం చేసినతరువాత నీళ్లు తాగేందుకు కుళాయిలు ఏర్పాటుచేయడం జరిగింది.

- మదన్ మోహన్, డిప్యూటీ ఐఓఎస్ అధికారి

రేషన్ బియ్యం విక్రయ ముఠాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం
- 9 మంది అరెస్ట్



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సివిల్ సప్లై అధికారులతో కలిసి హుమయూన్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట, యాకుత్‌పురా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం వ్యాపారులుగా చెలామణి అవుతున్న అత్తాపూర్‌కు చెందిన విశాల్‌యాదవ్ (22), ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నాసిర్ (28), వారాసిగూడకు చెందిన మహ్మద్ షోయబ్(20), మహ్మద్ జహంగీర్, (28), ఎండీ షాబాజ్ (28)సరూర్‌నగర్‌కు చెందిన సంగం లోవ అలియాస్ రాజు(24), పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీం (25), అంబర్‌పేటకు చెందిన సయ్యద్ రహీం(25), సయ్యద్ నిజాం (24), మహ్మద్ మజార్(28) రేషన్ బియ్యం దందా చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరించి, నిల్వ ఉంచుతున్నారు. వాటిని అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అరెస్ట్ చేశారు.

ఓయూ హాస్టళ్ల ఉద్యోగులకు జీతాలు పెంచాలి

- ఐఎఫ్‌టీయూ నేత ఎస్‌ఎల్ పద్మ డిమాండ్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లో 1992 నుంచి పనిచేస్తున్న హాస్టల్ అండ్ మెస్‌లోని ఉద్యోగులకు జీతాలు పెంచాలని, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ నేత ఎస్‌ఎల్ పద్మ డిమాండ్ చేశారు. ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) ఓయూ కమిటీ ఆధ్వర్యంలో గురువారం లేడీస్ హాస్టల్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఎల్ పద్మ మాట్లాడారు. యూనివర్సిటీలో కనీస వేతనాలు అమలవుతున్నప్పటికీ వీడీఏ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. క్యాజువల్ లీవ్ లేకపోవడం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించినా అనేక అవకతవకలతో హాస్టల్ ఉద్యోగులు వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. 385 మంది ఉద్యోగుల్లో సగం మందికి మాత్రమే ఈఎస్ఐ కార్డులు ఇచ్చారని, హాస్టల్ ఉద్యోగుల జీతాలు ప్రతీనెల ఐదో తేదీ లోపు వేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని తెలిపారు. 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వాళ్లని ఉద్యోగాల్లో నుంచి అక్రమంగా తొలగించడం మానుకోవాలని, చిన్న కారణాలకు పెద్ద శిక్ష వేయడం కార్మిక చట్టాల రీత్యా నేరమన్నారు. ఏడాదిన్నరగా ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయని ఏజెన్సీల కాంట్రాక్ట్‌ను ఎందుకు రద్దుచేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఓయూ కమిటీ నాయకులు ఈశ్వర్, లక్ష్మి, వెంకటేష్, విజయ, అనిత, పద్మ, జయ, లలిత, సామ్రాజ్య, శాంత శ్యామల నాహేద తదితరులు పాల్గొన్నారు.

ప్రొస్టేట్ ఇబ్బందులకు 'రెజమ్ వాటర్ వేపర్ థెరపీ'

- తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి
- ప్రొస్టేటిక్ అబ్ స్ట్రక్షన్ సమస్యలకు చెక్



రెజ్ వాటర్ వేపర్ థెరపీ తర్వాత రోగితో యశోద ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మూత్ర విసర్జన నొప్పి సమస్యను ఎదుర్కొంటున్న ఓ వృద్ధుడికి యశోద ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స లేకుండా ఆధునిక విధానంలో వైద్య ప్రక్రియను నిర్వహించి సమస్యకు చెక్ పెట్టారు. సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో యూరాలజీ విభాగంలో రెజమ్ వాటర్ వేపర్ థెరపీని ఇటీవల విజయవంతంగా నిర్వహించారు. ఈ తరహా ప్రక్రియ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని ఆస్పత్రి వైద్యులు వివరించారు. కామారెడ్డికి చెంది ఎస్.అంజాగౌడ్ (68) అనే రైతు కొన్ని వారాలుగా మూత్ర విసర్జన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన సీనియర్ యూరాలజిస్టు రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డాక్టర్ వి.సూర్యప్రకాష్‌ను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించి, బ్లాకేజ్ సమస్యగా నిర్ధారించారు. దీనిని 'రెజమ్ వాటర్ వేపర్ థెరపీ' ద్వారా తొలగించామన్నారు. ఈ చికిత్స తర్వాత అదే రోజు ఇంటికి వెళ్లవచ్చని డాక్టర్ వి.సూర్యప్రకాష్ చెప్పారు.



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వార్షిక వేడుకల్లో జంపన ప్రతాప్

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాలు

బోయినపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఒకటోవార్డు చిన్నతోకట్టలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఈ నేపథ్యంలో రెండవ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామివారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. పూజలు అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ వేడుకల్లో టి.ఎన్. మురారి, జగన్నాధం, జాజుల క్రాంతి, వరప్రసాద్, నాగరాజ్ యాదవ్, అర్జున్, ముఖేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా టీడీపీ విజయోత్సవ సంబురాలు



ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో టీడీపీ విజయోత్సవ సంబురాలు జరుపుకుంటున్న సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తార్నాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ విజయోత్సవ సంబురాలను చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. విజయోత్సవ సంబురాల్లో భాగంగా టపాసులు కాల్చి, చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడంతో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, తెలుగు దేశం పార్టీ ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యాన్ని ప్రసాదించి రాజకీయ అవకాశాలను కల్పించిందన్నారు. అనంతరం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికై అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్, సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు వేమూరి నరేష్, గణేష్ యాదవ్, గోపయ్య, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఈనెల 24న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలను వాయిదా వేయాలి'

తార్నాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 24 నిర్వహించనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అభ్యర్థులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈ నెల 24 న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సీఎస్ఐఆర్, నెట్, ఎస్ఎస్‌సీ పేజ్ 12, ఢిల్లీ పోలీస్ పరీక్షలు ఉన్నందున్న, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలను కూడా అదే రోజు నిర్వహించినట్లయితే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశాం ఉందన్నారు. ఇదే విషయాన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌ను కలిసి విన్నవించినా ఎటువంటి స్పందన రాలేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ నెల 24 నిర్వహించనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు.

అరగంట పాటు భారీ వర్షం జలమయమైన రహదారులు



మారేడుపల్లిలో చెట్ల కొమ్మలు తొలగించే పనులు పర్యవేక్షిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం 3.30గంటల సమయంలో అరగంట సేపు కురిసిన కుంభవృష్టికి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా మనోహర్ థియేటర్ వెనుక వైపు మోకాలి లోతు వరద నీరు చాలా సేపు నిలిచిపోయింది. రాష్ట్రపతి రోడ్డు, సర్దార్ పటేల్ రోడ్డులో వరదనీరు నిలిచిపోయింది. ఈ రహదారులు ప్రధాన రహదారులు కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మారేడుపల్లిలో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. బాటసారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

రంగంలో దిగిన జోనల్ కమిషనర్ రవికిరణ్

భారీ వర్షానికి తలెత్తిన సమస్యలను పరిష్కరించడానికి జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ స్వయంగా రంగంలోకి దిగారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ విభాగాల అధికారులను సైతం రప్పించి, సహాయ చర్యలపై దృష్టి సారించారు. జోన్ వ్యాప్తంగా ఈపాటికే గుర్తించిన 17 వాటర్ లాగింగ్ పాయింట్లకు సిబ్బందిని పంపించారు. వరదనీరు ఎక్కువ సేపు నిలవకుండా, సమీపంలోని డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మళ్లించే పనులు చేపట్టారు. మ్యాన్‌హోళ్ల వద్ద పేరుకు పోయిన చెత్తచెదారాన్ని తొలగించారు. మారేడుపల్లిలో విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించారు.



సైక్లింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి నిలయం అధికారులు

రాష్ట్రపతి నిలయంలో సైక్లింగ్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నిలయంలో అధికారుల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ వినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 30న సైక్లింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని రాష్ట్రపతి నిలయం కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ కే.రజనీప్రియ గురువారం తెలిపారు. సైక్లింగ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రపతి నిలయం నుంచి ఈసీఎల్ ఎక్స్‌రోడ్ వరకు అక్కడి నుంచి రాష్ట్రపతి నిలయం వరకు 11కిలోమీటర్ల సైక్లింగ్ ఉంటుందని ఆమె తెలిపారు. రాష్ట్రపతి నిలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ స్థాపకులు రవీందర్ నందనూరి వారితో పాటు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ ఆరోగ్యకరమైన జీవన విధానమును పెంపొందించుకోవడం కోసం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రపతి నిలయం అధికారులు తెలిపారు. జూన్ 30న ఉదయం 6గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆసక్తి కలిగినవారు రాష్ట్రపతి నిలయం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సాయిరామ్

రాంగోపాల్‌పేట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. రాంగోపాల్‌పేట్ ఏఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం... రాంగోపాల్‌పేట్ చుట్టాల బస్తీకి చెందిన ఉషాకు అదే ప్రాంతానికి చెందిన సాయిరామ్‌తో 2011లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా సాయి రామ్ గత నెల 28న మద్యం తాగేందుకు బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. మహబూబ్‌నగర్ రూరల్ ప్రాంతంలోని ఓ కట్టింగ్ షాపు నడిపే శ్రీకాంత్ అనే వ్యక్తి సాయిరామ్ మద్యం మత్తులో షాపుముందు పడి ఉన్నాడని, అతని ఫోన్ తన వద్ద ఉందని, ఉదయం ఇద్దామని చూస్తే సాయిరామ్ కనిపించలేదని, అందులోని ఫోన్ నెంబర్ ద్వారా ఉషాకు రెండు రోజుల తరువాత 30వ తేది రాత్రి సమాచారం ఇచ్చాడు. గతంలో కూడా ఇలా ఇల్లు వదిలి వెళ్ళిన సాయిరామ్ అలాగే మళ్ళి తిరిగి వస్తాడని చూడగా రాకపోయేసరికి బుధవారం రాత్రి రాంగోపాల్‌పేట్ పేలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సాయిరామ్ కనిపిస్తే రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో గాని 8712660180, 8712660184, 8712661242 నెంబర్లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 104 ఆవులు స్వాధీనం

కోదాడ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 104 ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీద్‌ఖాన్, యూసఫ్, సలీం ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 104 ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని సమాచారం అందింది. గురువారం కోదాడ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ ప్రారంభించారు. కంటైనర్‌ను గుర్తించి, ఆవులను, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆవులను ఏపీ రాష్ట్రంలోని వేదాద్రి దేవాలయ గోశాలకు తరలించి, సంబంధితులతో పాటు వాహన డ్రైవర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూలై 9న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం



ఎల్లమ్మ తల్లి మూల విరాట్

అమీర్‌పేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం జూలై 9న వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. జూలై 8న ఒగ్గు కళాకారులతో పుట్టమన్ను తెప్పించడంతో పాటు ఎస్ఆర్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఎదుర్కోళ్లు, (శాక్తేయముగా) నిర్వహిస్తూ ఎల్లమ్మ దేవస్థానం వరకు ఊరేగింపుగా రావడంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9న ఆలయానికి తూర్పుముఖంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తారు. 10వ తేది 6గంటలకు కల్యాణం వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులతో రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈసారిమాత్రం కల్యాణ సమయం దగ్గరపడుతున్నా ఏర్పాట్లు, ఆలయ సుందరీకరణపై ఆలయ చైర్మన్, అధికారులు పెద్దగా దృష్టి సారించడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఈవో నాగరాజు లాంగ్ లీవ్‌లో ఉండడం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు తీసుకున్న జ్యువెల్లరీ ఇన్‌స్పెక్షన్ అధికారి(జేవీవో) అంజలీదేవి ఏర్పాట్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం అని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని సంజీవయ్యకాలనీలో పవర్ బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, కంటోన్మెంట్ బోర్డు నిధులతో బస్తీలు, కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంకి రవీందర్, శ్యాసుందర్ రెడ్డి, భాస్కర్‌గౌడ్, నరేందర్ యాదవ్, సందీప్, విక్కీ, సాయి, సంతోష్ యాదవ్, జి.రాజు, నాగులు, బొట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు సన్మానం

కంటోన్మెంట్ నియోజకవర్గం 5వ వార్డు పరిధిలోని న్యూవాసవీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, బోయినపల్లి మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ నాయకుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానించారు. గురువారం అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి, ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినయ్, వైస్ ప్రెసిడెంట్లు రాములు, శశి, కాంగ్రెస్ నాయకులు తేలుకుంట సతీష్‌గుప్తా, రేపల్లె వెంకటేశ్వర్లు ఉన్నారు.

అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసనకు యత్నం

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాయదుర్గం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా నిఘా సంస్థలు డైరెక్టెడ్ వెపెన్స్‌తో తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడంపై టార్గెటెడ్ ఇన్‌డ్యావిజువల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రావితరుణ్ ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మరో నలుగురు సభ్యులతో కలిసి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులెట్ వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందింది. వారు రావి తరుణ్‌తో సహా మరో ముగ్గురిని గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులు, భారత సంతతికి చెందిన చాలామంది నిఘా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. న్యూరో వెపన్స్ ద్వారా అమెరికా నిఘా సంస్థలు అమెరికాలో ఉంటున్న వివిధ విదేశీ సమూహాలపైన నిఘాపెట్టి వేధిస్తున్నాయని ఆరోపించారు. ప్రారంభంలో అమెరికా పరిశోధన కేంద్రాల్లో నిమగ్నమై ఉన్న టెక్నాలజీ క్రమంగా అమెరికా ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేటర్ శక్తులకు అవసరంగా మారిందన్నారు. ఈ సమస్యపై అందరికీ అవగాహన కల్పించి జాగృతం చేయడమే తమ లక్ష్యమని తరుణ్ పేర్కొన్నారు. న్యూరో వెపన్స్ గురించి హవాన సిండ్రోమ్, సింథటిక్ టెలిపతి గురించి ఎవరికి వారు పరిశోధన జరిపి, నిగ్గుతేల్చుకుని వినాశనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పోలీసు అరెస్టులు తమ కార్యక్రమాన్ని ఆపవని, భవిష్యత్‌లో పలు సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని అన్నారు. వ్యక్తిగత పూచీకత్తుపై వారిని వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్



పేపర్ ప్లేట్ యంత్రాన్ని పరిశీలిస్తున్న గారేత్ వాన్ ఒవెన్

అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పేపర్ ప్లేట్ మెషిన్ అందజేస్తున్నట్లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్ తెలిపారు. గురువారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రేమలీల ట్రాన్స్‌జెండర్ కార్యాలయంలో పేపర్ ప్లేట్ మెషిన్‌ను ఆయన అందజేశారు. ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి తోడ్పాటునందిస్తున్న హాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోనిని అభినందించారు. ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి మాట్లాడుతూ హాస్ సంస్థ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. ఆంథోని మాట్లాడుతూ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు ట్రాన్స్‌జెండర్లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.